క్లుప్తంగా

జాతీయ రహదారిపై విచ్చలవిడిగా లారీల నిలుపుదల



జాతీయ రహదారిపై నిలుపుదల చేసిన లారీలు

దెందులూరు: జాతీయ రహదారిపై ఆశ్రం హాస్పిటల్ నుంచి సీతంపేట వరకు లారీలను విచ్చలవిడిగా నిలుపుదల చేస్తున్నారు. నేషనల్ హైవే పక్కన ఉన్న దాబా హోటల్, మొబైల్ టిఫిన్ వ్యాన్ల వద్ద ప్రతి రోజూ ఉదయం, రాత్రి లారీలను నిలుపుదల చేస్తున్నారు. ఈ నేషనల్ హైవేపై రోజుకు 50 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మీద నిలిచిపోయిన వాహనాలు పక్కకు తొలగించడానికి నేషనల్ హైవే మొబైల్ టీంలు పెట్రోలింగ్ టీంలు ఉన్నప్పటికీ లారీల నిలుపుదల మాత్రం అలాగేఉంటుంది. గతంలో నిలిచిపోయిన లారీలను ఢీకొట్టిన సంఘటనలో మృత్యువాతకు గురైన సంఘటనలు మూడు ఉన్నాయి. పోలీసులు ఈ పరిస్థితిని చక్కదిద్దాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం



చర్చికి ఆర్థికసాయం అందజేస్తున్న దాత

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి డేనియల్ డి.సాయి (హైదరాబాద్) రూ.50 వేలను సాల్వేషన్ ఆర్మీ రిటైర్డ్ ఆఫీసర్ జోషియాకు అందజేశారు. దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ రమణయ్య రిటైర్డ్ ఆఫీసర్ జోషియా దాత డేనియల్ డి.సాయి, కుటుంబ సభ్యులను అభినందించారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి

ఉంగుటూరు: స్థానిక ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో కూలిపోయిన కల్వర్టు స్థానంలో కొత్త కల్వర్టును గ్రామ పంచాయతీ నిర్మించింది. ఇందు కోసం గ్రామ పంచాయతీ నిధులు సుమారు రెండు లక్షలు వెచ్చించారు. మే, జూన్ నెలల్లో బరువైన కంకర లారీలు ఈ రహదారి వెంబడి తిరగడంతో ఈ కల్వర్టు కూలిపోయింది. ఫలితంగా ప్రజలు నెల రోజులుగా ఇబ్బందులు పడ్డారు. సర్పంచి బండారు సింధు కల్వర్టును యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. నారాయణపురం వంతెన పడిపోవడంతో ఇటుగా తహసీల్దార్ కార్యాలయం మీదుగా వాహనాలు తిరగడంతో పంచాయతీకి ఆర్థికంగా నష్టం వాటిల్లింది.

పారిశుద్ధ్యం అధ్వానం

- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్త
- ఏరోజుకారోజు తొలగించని కార్మికులు
- పట్టించుకోని అధికారులు



జీడీ కాలనీలో పూర్తిగా నాచుతో నిండిపోయిన డ్రెయినేజ్



శంకరమఠం వీధిలో దోమలకు ఆవాసాలుగా మారిన డ్రెయినేజీలు

ఏలూరు (టూటౌన్): నగరంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ఏలూరు టూటౌన్ ప్రాంతంలో ఎక్కడ చూసినా డ్రెయినేజీలు ఎక్కడికక్కడ దుర్గంధం వెదజల్లుతున్నాయి. డ్రెయిన్లలోని మురుగు నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి హోటల్స్, రెస్టారెంట్లు ఉన్న ప్రాంతాల్లో మరీ ఎక్కువగా కన్పిస్తుంది. ఈ ప్రాంతాల గుండా నడిచి వెళ్లే పాదచారులు, వాహనదారులు ముక్కుమూసుకుని మరీ ప్రయాణించాల్సిన దుస్థితి కన్పిస్తుంది. కార్పొరేషన్ పరిధిలోని మురుగు డ్రెయిన్లను కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేయకపోవడంతో ఎక్కడిచెత్త అక్కడే ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో కొద్ది పాటి వర్షానికే డ్రెయిన్లు పొంగి మురుగు నీరు రోడ్లపైకి చేరుతుంది. ఒక్కోసారి డ్రెయినేజీలను క్లీన్ చేసి దానిలోని సిల్ట్‌ను రోడ్డు పక్కగా వేసి ఉంచి తర్వాత రెండు, మూడు రోజులకు తొలగిస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పలు ప్రాంతాల్లో పూడుకుపోతున్న డ్రెయిన్లు

ప్రధానంగా రెండవ పట్టణ ప్రాంతంలో హోటల్స్, రెస్టారెంట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటి పరిధిలో వినియోగించే మురుగునీరు, చెత్త చెదారం అంతా డ్రెయినేజీల్లోకి వదిలి వేస్తుండటంతో ఆ ప్రాంతాల్లో డ్రెయిన్లు పూడుకుపోతున్నాయి. నగరపాలక సంస్థ సిబ్బంది డ్రెయిన్ల పూడిక తీసినా మళ్లీ కొద్ది రోజులకే యథాస్థితికి చేరుకుంటున్నాయి. డ్రెయినేజీల్లో వ్యర్థాలను, మురుగు నీటిని ఇష్టానుసారం వదిలేసే హోటల్స్, రెస్టారెంట్లపై నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అడిగేవారు ఎవ్వరూ లేకపోవడంతో యజమానులు తమ ఇష్టానుసారం చేసుకుపోతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

వ్యాపార సముదాయాల ముందు డ్రెయిన్ల అస్తవ్యస్తం

ప్రధానంగా ఏలూరు రెండవ పట్టణ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు ఎక్కువగా కన్పిస్తాయి. ఈ క్రమంలో ఎవరికి వారు తమ షాపుల ముందు డ్రెయినేజీని ఆనుకుని ఇష్టానుసారం వ్యాపారాలు చేస్తున్నారు. డ్రెయిన్లపై రాళ్లు లాంటివి వేసి మూసివేస్తుండటంతో డ్రెయిన్లు మొత్తం వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిల్స్, టీ కప్పులు వంటి వాటితో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో మురుగు నీరు ఎటూ పారకుండా ఎక్కడిది అక్కడే నిలిచిపోతుంది. దీంతో కొన్ని రోజులకు వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. వీటిని క్రమబద్ధీకరించాల్సిన పారిశుధ్య సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది ఆయా దుకాణదారులు, హోటల్స్, రెస్టారెంట్ల వారి వద్ద నెలవారీ మమూళ్లు తీసుకుంటూ మిన్నకుంటున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.



ద్వారకానగర్‌లో డ్రెయినేజీ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయిన దృశ్యం



శంకరమఠం వీధిలో ముందుకు కదలని డ్రెయినేజీ వాటర్



విజయవిహార్ సెంటర్‌లో డ్రెయినేజీ దుస్థితి

దోమలకు నిలయాలుగా డ్రెయిన్లు

నగరంలో ఎక్కడ చూసినా డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉండటంతో దుర్గంధం వెదజల్లడటంతో దోమలకు ఆవాసాలుగా మారిపోతున్నాయి. ఇవి పెద్ద సంఖ్యలో గుడ్లను పెడుతూ తమ సంతతిని పెంచుకుంటూ పోతుండటం పరిపాటిగా మారిపోయింది. మరోపక్క దోమల కారణంగా ప్రజలకు వైరల్ జ్వరాలు, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. దోమలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉంటే కొంత వరకైనా దోమల అభివృద్ధికి అడ్డుకట్ట వేయవచ్చునని నగర ప్రజలు చెబుతున్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలను నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని పెంచుకోవాలి



నగరంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించేందుకు ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోని పక్షంలో కాంట్రాక్ట్ విధానంలో మరికొంత మంది సిబ్బందిని పెంచుకోవాలి. తద్వారా నగరంలో డ్రెయినేజీ, పారిశుద్ధ్యం మెరుగు పడే అవకాశం ఉంటుంది. అధికారులు పారిశుద్ధ్య కార్మికులు తమ విధులు సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలి.

పిచ్చుక ఆదిశేషు, చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్,ఏలూరు

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలి



నగరంలోని అన్ని మురుగు డ్రెయిన్లు క్లీన్ చేసి మెరుగు పర్చాలి. అధిక వర్షాలు కురిసిన సమయంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా డ్రెయినేజీలన్నింటినీ శుభ్రం చేస్తే బాగుంటుంది. లేని పక్షంలో వర్షాకాలంలో కొద్దిపాటి చినుకులకే మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు,ఏలూరు

నేడు పీజీఆర్ఎస్

పెదవేగి: మండల కేంద్రమైన పెదవేగి తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తామని తహసీల్దార్ భ్రమరాంబ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల సమస్యలను వినతుల రూపంలో స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలని ఆమె అన్నారు.

ప్రతిష్ఠామూర్తులకు అభిషేకాలు

దెందులూరు: గోపన్నపాలెం శ్రీకోదండ రామాలయంలో ఆదివారం ప్రతిష్ఠామూర్తుల విగ్రహాలకు భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. సోమవారం ప్రతిష్ఠించనున్న శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణేశ సుబ్రమణ్య, శ్రీకృష్ణ, అయ్యప్పస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవ సందర్భంగా ఆదివారం గోపన్నపాలెంలో ఉదయం ఆలయంలో హోమం ప్రధాన కలశ ఆవాహన నక్షత్ర మండపారా ధన నిర్వహించారు. గోపన్నపాలెంతోపాటు సమీప గ్రామాలనుంచి అధికసంఖ్యలో భక్తులు విగ్రహ మూర్తుల అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం: ఆటో ఢీకొని మోటార్‌సైకిల్‌పై వెళుతున్న భార్యభర్తలు గాయపడిన ఘటన కంద్రికగూడెం సాయిబాబాగుడి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దొరమామిడి సమీపంలోని నిర్వాసిత గ్రామం సరుగుడుకు చెందిన ఇరపా పెంటయ్య, భార్య కుమారి రాజానగరంలో చదువుతున్న తమ కుమార్తెను చూసేందుకు ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. కంద్రికగూడెం సాయిబాబా గుడి సమీపంలోకి వచ్చేసరికి కన్నాపురం నుంచి ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో వారి వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో పెంటయ్యకు తీవ్ర గాయాలు కాగా, అతని భార్య కుమారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఢీకొట్టిన ఆటోలోనే స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువచ్చారు. ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పెంటయ్య కుడికాలుకు అయిన గాయానికి 16 కుట్లు వేసినట్లు వైద్యులు తెలిపారు.

ఘనంగా నర్తన బాల అవార్డుల ప్రదానోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) హాల్‌లో 10వ జాతీయ స్థాయి నర్తనబాల అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 68మంది చిన్నారి నర్తకులు వారి ప్రతిభాపాటవాలు ప్రదర్శించి అవార్డులు అందుకున్నారు. నాట్యరంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ పదో తరగతి పరీక్షలలో 580-595 మార్కులు సాధించిన నర్తన చిన్నారులకు అభినయ విద్యా పురస్కారాలు అందజేశారు. ఉదయం అవార్డుల కార్యక్రమానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు, అంబికా సంస్థల అధినేత అంబికా కృష్ణ, త్రినాథ్ సంస్థల అధినేత శలా రాజాబాబు, సీఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముక్కామల కృష్ణారావు, లయన్స్ పూర్వపు గవర్నర్ లయన్ వల్లూరిపల్లి మురళీమోహనరావు, విశ్రాంత లెక్చరర్ పీ. ఆంజనేయులు, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు పాల్గొన్నారు. ఉదయం మానేపల్లి సత్యనారాయణ, హేమసునీత దంపతులచే నటరాజ పూజ నిర్వహించారు. సాయంత్రం జరిగిన నర్తనబాల అవార్డులు, విద్యా పురస్కారాలు ప్రదానోత్సవ సభకు అతిథులుగా మానవత స్టేట్ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, సెట్వెల్ సీఈఓ ప్రభాకర్, ఛార్టర్డ్ అకౌంటెంట్ గురజాడ శ్రీకాంత్, మానవత ఏలూరు అధ్యక్షుడు ఎంఎస్ఎంఎస్. కుమార్, నర్రా బుజ్జి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య బీ. హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



నర్తనబాల అవార్డులు అందుకున్న చిన్నారి నృత్యకారిణులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, కొక్కిరాయిలంక గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 33 కెవీ లైన్ ఏర్పాటు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏలూరు రూరల్ మండలం అసిస్టెంట్ ఇంజనీర్ నరసయ్య తెలిపారు. రెండు గ్రామాల్లో వినియోగదారులు విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పెదవేగి: పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జానంపేటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడిచేసి, పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1940 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కోదండ రామాలయం పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన

భీమడోలు: సూరప్పగూడెంలోని శ్రీకోదండ రామాలయం పునః నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శుభ ముహూర్తంలో పూజలు చేశారు. పూజారుల బృందం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని పూజలు చేశారు. గ్రామంలోని కోదండ రామాలయం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా ఆలయాన్ని నిర్మించేందుకు భక్తులు, గ్రామ పెద్దలు ముందుకొచ్చారు. దీంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలోని పెద్ద ఎత్తున దంపతులు పూజల్లో కూర్చున్నారు. గ్రామస్తులు, భక్తులు ఆనందం, ఉత్సాహం వెల్లివిరిశాయి.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, ప్రజలపై మోపిన విద్యుత్ బారాలను రద్దు చేయాలని కోరుతూ 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం వద్ద జరిగిన జిల్లా కార్యవర్గ విస్తృత గూగుల్ సమావేశం జరిగింది. గూగుల్ సమావేశానికి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రాలు అక్కినేని వనజ మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పార్టీలు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని ఇచ్చిన హామీని విస్మరించి, గత ఏడాది కాలంగా వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపిందని ఆమె విమర్శించారు. ఆగస్టు 5వ తేదీ మంగళవారం నాడు ఏలూరు జిల్లాలో విద్యుత్ కేంద్రాల వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర మహాసభలు సందర్భంగా ఆగస్టు 8వ తేదీన ఏలూరులో జిల్లా సమగ్ర అభివృద్ధిపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభకు ఏలూరు జిల్లా నుంచి పార్టీ, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు వందలాదిమంది ఒంగోలు తరలి వెళ్తున్నట్లు తెలిపారు.గూగుల్ మీటింగ్ లో సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మున్నీరు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారం ధారయ, బాడిశ రాము, కోన్నే లక్ష్మయ్య, వరక శ్యామల, తొర్లపాటి బాబు, జిల్లా సమితి సభ్యులు టీవీఎస్ రాజు, చాట్ల పుల్లారావు, టి ఆంజనేయరాజు, బి.ఎస్.సాగర్, మన్నవ యామిని, గోలిమే బాలయేసు, కంచర్ల గురవయ్య, కూరాకుల బాబు రావు పాల్గొన్నారు.



పర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

అ‘పూర్వ’ కలయిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (ఏఆర్‌డీజీకే) నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి గొంతిన రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నమట్ల కాంతి జయకుమార్ ఇదే స్కూల్లో ఉన్నత ప్రమాణాలతో విద్యను అభ్యసించి ఇదే స్కూల్లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఈ సంవత్సరం నుంచి ప్రధాన ఉపాధ్యాయులుగా పదోన్నతి పొంది అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి ఎండీ హుస్సేన్ మాట్లాడుతూ ఈరోజు స్నేహానికి ప్రతీకగా జిల్లా నలుమూలల నుంచి స్కూల్‌కి విచ్చేసిన ఆత్మీయ స్నేహితులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఆర్‌డీజీకే ప్రధానోపాధ్యాయుడు వీ. కాంతి జయకుమార్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేతర అజయ్ బాబు, నీలం సాయి గోపాల్, కే. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహ బంధానికి ప్రతీకగా చేతులు కలిపిన పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

పుస్తక పఠనంతోనే విజ్ఞానం



భీమడోలు గ్రంథాలయంలో జీకే అంశాలను వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: పుస్తక పఠనం చేయడం ద్వారానే విజ్ఞానం సంపాదించుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. ఒక పుస్తకం వంద మంది స్నేహితులతో సమానమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జీకే, కరెంట్ ఎఫైర్స్, బుక్ షో కార్యక్రమాలను నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాలను చిన్నారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో రిటైర్డ్ ఏఎస్సై షరీఫ్ పాల్గొన్నారు.

స్నేహితుల అనుబంధం వెలకట్టలేనిది

దెందులూరు: స్నేహితుల అనుబంధం వెలకట్టలేనిదని పలువురు వక్తలు అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆగస్టు తొలి ఆదివారం వచ్చే ఈ రోజును స్నేహితుల దినోత్సవంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. స్నేహితుల మధ్య బంధాన్ని తెలుపుకుంటూ పిల్లలు, యువత, పెద్దలు ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఒకరినొకరు తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకొని ఫ్రెండ్‌షిప్ బాండ్లను కట్టుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో స్నేహితుల కోసం సందేశాలు, ఫొటోలను షేర్ చేసుకున్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం, పాలగూడెం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గ్రామ సర్పంచ్ పి సునీత ఇంట్లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముగ్గురు మహిళలు స్నేహితులు గ్రామ సర్పంచ్లు కావడం మరిచిపోలేని మధురానుభూతి అని జాలిపూడి గ్రామ సర్పంచ్ నవ్య, కొక్కిరాయలంక గ్రామ సర్పంచ్ అమల, పాలగూడెం గ్రామ సర్పంచ్ సునీతలు తెలిపారు.



ఫ్రెండ్‌షిప్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు

మోటార్‌సైకిల్ చోరీ

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీపై కేసునమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై డి.శశాంక తెలిపారు. నిమ్మలగూడెంకు చెందిన తుమ్మల రాంబాబు ఈ నెల 29వ తేదీ రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లో నిద్రించాడు. ఉదయం లేచి చూడగానే ద్విచక్రవాహనం కనిపించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	24	బిళ్లచిక్కుడు	120
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	64	కంద	00
కాకర కాయలు	40	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	26	అల్లం	88
క్యారెట్	40-45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	46	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	33